
సాక్షి ఒడిశా

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,25,465
బంగారం	1 గ్రాము 650 మిల్లీ గ్రాములు
వెండి	30 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



హైలెస్సో.. హైలెస్సా..!

మల్కన్‌గిరి జిల్లాలో మాల్యవంత్ ఉత్సవాల్లో భాగంగా సత్తిగూడ జలాశయంలో పడవ పందేలు మంగళవారం నిర్వహించారు.

-8లో



మావోయిస్టుల పేరుతో బెదిరింపులు

మావోయిస్టుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను దొరాగుడ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తరలించారు.

-8లో

ట్యాగ్ కేర్..!

- ఆలివ్ రిడ్లేలపై పరిశోధనలు ప్రారంభం
- ఆడ తాబేళ్లకు ట్యాగ్‌లు
- సంగమం అనంతరం ట్రాకింగ్ పరిశీలన



ఆలివ్ రిడ్లేలకు ట్యాగ్‌లు అమర్చుతున్న జెడ్‌ఎస్‌ఐ బృందం

గంజాం జిల్లా రుషికుల్య నది సముద్ర ముఖద్వారం వద్దకు సంతానాభివృద్ధి కోసం వస్తున్న అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సోమ, మంగళవారం రెండు రోజులు జులాజికల్ సర్వే అఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ) గోపాల్‌పూర్ ఆధ్వర్యంలో రుషికుల్య నది సముద్ర ముఖద్వారం వద్దకు వచ్చిన తాబేళ్లకు ట్యాగింగ్ చేశారు. అనంతరం వాటిని తిరిగి సముద్రంలో విడిచి పెట్టినట్లు గోపాల్‌పూర్ జులాజికల్ సర్వే అఫ్ ఇండియా ఇన్‌చార్జి అధికారి అనిల్ మహాపాత్రో తెలియజేశారు. సంగమానికి నది తీరానికి వచ్చిన ఆడ తాబేళ్లకు ట్యాగ్‌లు వేసి వాటి ట్రాకింగ్‌ను పరిశీలించడంతో పాటు సంరక్షణ చర్యలు తీసుకోనున్నట్లు రివిజనల్ చీఫ్ కంజర్వేటర్ ఫారెస్ట్ సురేష్ పంత్ తెలియజేశారు. అరుదైన తాబేళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనికోసం ఎన్జీవోలు, సీజీవో ముఖ్య భూమిక పోషించాలని సూచించారు. ఈ ఏడాది అత్యధిక సంఖ్యలో తాబేళ్లు సంతానోత్పత్తికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దీంతో పుర్ణబొందా, గొకురకుదా, పనిగొండా, ఐఆర్ఈ, గోపాల్‌పూర్ పోర్టు ప్రాంతాల్లో సైతం సంతానాభివృద్ధి కోసం చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

- బరంపురం



తాబేలుకి అమర్చిన మెటల్ ట్యాగ్





రుషికుల్య ముఖద్వారం వద్ద సంగమిస్తున్న ఆలివ్ రిడ్లేలు

వణికిస్తున్న చలి



- రాష్ట్రంలో మరింత పడిపోయిన ఉష్ణోగ్రతలు
- 17 ప్రాంతాల్లో 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు

భువనేశ్వర్: ఉత్తర–వాయువ్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు విపరీతంగా పడిపోతున్నాయి. గత 24 గంటల్లో అనేక ప్రాంతాల్లో రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ నమోదవ్వడంతో రాష్ట్రమంతటా చలి వణికిస్తోంది. స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం సమాచారం ప్రకారం కెంజొహర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 9.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. మరో 17 చోట్ల రాత్రి ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదైంది. కందమల్ జిల్లా దారింగిబడి, ఫుల్బాణిలో వరుసగా 9.5 డిగ్రీల సెల్సియస్, 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పొడి వాతావరణం

రానున్న వారం రోజుల్లో రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉత్తర–వాయువ్య దిశ నుంచి వీచే చల్లని, పొడి గాలులు చలిని తీవ్రతరం చేస్తాయి. డిసెంబర్ 15 వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు రెండూ పెరిగే అవకాశం ఉంది. మంగళవారం భువనేశ్వర్, కటక్ నగరాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు వరుసగా 14.6 డిగ్రీల సెల్సియస్, 14.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

పొగమంచు ఏర్పడే అవకాశం

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల మితమైన పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కార్యాలయం అంచనా వేసింది. గత 24 గంటల్లో కందమల్ జిల్లా జి.ఉదయగిరిలో రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రత 7.2 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగు చోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యాయి. సుందర్‌గడ్, కెంజొహర్, కొరై ప్రాంతాల్లో 9.4 డిగ్రీల సెల్సియస్‌గా రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తదుపరి స్థానంలో దారింగ్‌బడి, ఫుల్బాణి ప్రాంతాల్లో 9.5 డిగ్రీల సెల్సియస్, కందమల్ జిల్లాలో 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయింది. అంగుల్‌లో 10.6 డిగ్రీల సెల్సియస్, సుందర్‌గడ్‌లో 11, కొరాపుట్‌లో 11.2, బాలాసోర్, రూర్కెలా ప్రాంతాల్లో 11.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. భువనేశ్వర్, కటక్ జంట నగరాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ రికార్డు అయింది. ఈ నగరాల్లో వరుసగా 14.6, 14.5 డిగ్రీల సెల్సియస్ రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్ర రాజధానిలో సాధారణం కంటే 1.4 డిగ్రీలు తక్కువగా నమోదైనట్లు విశ్లేషించారు. కొరాపుట్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చలి గాలులు బలంగా వీస్తున్నాయి. కొండలు, మైదాన ప్రాంతాలపై ప్రభావం చూపుతోంది. శుక్రవారం రాత్రి నుంచి జిల్లాలో పలుచోట్ల 10 నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ట ఉష్ణోగ్రత పరిమితమవుతోంది.

తుఫాన్ ప్రభావంతో...

ముఖ్యంగా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా రాష్ట్రంలో ఈ సంవత్సరం డిసెంబర్ మొదటి వారంలో చల్లని వాతావరణం నెలకొంది. వాస్తవానికి సుమారు నెల రోజులు ఆలస్యంగా చలి ఆరంభమైంది. సాధారణంగా నవంబర్ నుంచి రాష్ట్రంలో చలి పెరగాల్సి ఉంది. కానీ అప్పుడు అంతటా చలి పెరగకున్నా, ప్రస్తుతం ఉత్తర, వాయువ్య దిశలో పొడి గాలుల ప్రవాహం కారణంగా గత రెండు రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీలు సెల్సియస్ వరకు తగ్గింది.

రాష్ట్రంలోని రైతులను ఆదుకోవాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- గవర్నర్ రఘుబర దాస్‌కు వినతిపత్రం అందజేత



బీజేపీ కృషక్ మోర్చా డిమాండ్లని పరిశీలిస్తున్న గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: ఇటీవల మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ కృషక్ మోర్చా ప్రతినిధుల బృందం రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృషక్ మోర్చా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మహేశ్వర్ సాహు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో అపార పంట నష్టం సంభవించిందన్నారు. వరి, పత్తి, కూరగాయల పంటలు నేలమట్టమయ్యాయని వాపోయారు. పంట నష్టం అంచనా ప్రక్రియ ముగించి 15 రోజుల వ్యవధిలో పీడిత రైతాంగానికి సత్వర పరిహారం చెల్లించేలా చూడాలని కోరారు. 23 ఏళ్ల సుదీర్ఘ బీజేడీ పాలనలో రాష్ట్ర రైతాంగం వార్షిక ఆదాయం, జాతీయ స్థాయిలో ఇతర రాష్ట్రాల కంటే తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విత్తనాలు, క్రిమి సంహారక మందులు ఉచితంగా అందజేసి, నష్టానికి గురైన పంట సాగుకు వినియోగించిన విద్యుత్ బిల్లు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గంజాయి పంట ధ్వంసం



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న అధికారులు



గంజాయి మొక్కలకు నిప్పు పెడుతున్న దృశ్యం

బరంపురం: గంజాం జిల్లా అస్కా బ్లాక్ అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, అక్రమంగా 122 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి పంటను ధ్వంసం చేశారు. జిల్లా ఎక్సైజ్ డీఎస్పీ అభిరామ్ కుమార్ బెహరా తెలిపిన వివరాల మేరకు.. అస్కా పోలీసుస్టేషన్ పరిధి అర్జునాపల్లి, పట్టశాల, బల్లిగుడా, కొలబడా, అందరిగుడా గ్రామాల అటవీ ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా ఆదేశాలతో దాడులు నిర్వహించారు. జేసీబీ సాయంతో మొక్కలను తొలగించి నిప్పు పెట్టారు. నష్టపరిచిన గంజాయి పంట విలువ సుమారు రూ.3.5 కోట్లు ఉంటుందని అస్కా తహసీల్దార్ కురేష్ చంద్ర జెనా వెల్లడించారు.

పక్కాగా ప్రసాదం విక్రయాలు

- భక్తులు మోసపోకుండా చర్యలు
- త్వరలో ప్రసాదాల ధరల పట్టిక ప్రదర్శన
- శ్రీమందిరం సీఏఓ రంజన్ కుమార్ దాస్

భువనేశ్వర్: శ్రీమందిరంలో పూరి జగన్నాథుని దర్శనం అనంతరం భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు పక్కాగా అందేలా చర్యలు తీసుకోనున్నారు. దీనిలో భాగంగా శ్రీమందిరం సముదాయం ప్రాంగణంలోని ఆనంద బజార్‌లో మహా ప్రసాద విక్రయాలను క్రమబద్ధీకరించేందుకు శ్రీజగన్నాథ ఆలయ పాలక మండలి (ఎస్‌జేటీఏ) పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) రంజన్ కుమార్ దాస్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆలయం 36 నియోగుల ప్రతినిధుల ప్రముఖులతో ఈ సమావేశం నిర్వహించారు.

భక్తుల సమస్యలు పరిష్కరించేందుకు

ఆనంద్ బజార్‌లో మహా ప్రసాదం విక్రయ సమయంలో భక్తులకు ఎదురవుతున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు ఆలయ ఛొతీసా (36) నిజోగ్ సభ్యులతో సీఏఓ సమావేశమయ్యారు. భక్తులు, యాత్రికులు మోసపోకుండా ఆనంద బజార్ మినహా ఇతర ప్రాంతాల్లో మహా ప్రసాదాల విక్రయానికి అనుమతించరు. శ్రీమందిరం సముదాయం కొయిలి వైకుంఠం, ప్రధాన సముదాయం ఆవరణ ఇతరేతర ప్రాంతాల్లో మహా ప్రసాదం విక్రయాలు పూర్తిగా నివారిస్తారు. విక్రయ కేంద్రాల్లో అమ్మకానికి అందుబాటులో ఉన్న అన్ని పదార్థాల పూర్తి ధరల వివరాలతో జాబితా బహిరంగంగా ప్రదర్శిస్తారు. తదుపరి సమావేశంలో స్వామి మహా ప్రసాదాల ధరల నిర్ణయం ఖరారవుతుంది. అనంతరం ధరల పట్టిక ప్రదర్శనకు సిద్ధం అవుతుందని సీఏఓ వివరించారు. ఈ మేరకు సువార్, మహా సువార్ సేవకులతో సంప్రదిస్తున్నారు.

సేవన కేంద్రాలు

భక్తులు, యాత్రికులు స్వామివారి మహా ప్రసాదం సేవించేందుకు అనుకూలమైన ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. 12వ శతాబ్దపు శ్రీమందిరంలోని ఆనంద్ బజార్ ప్రాంతాన్ని మొత్తం ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మార్చాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మహా ప్రసాదం విక్రయించేందుకు సంప్రదాయ పాత్రలను వినియోగించేలా సేవకులను ప్రోత్సహించాలని నిర్ణయించారు.

ప్రత్యేక ఉత్సవాల షెడ్యూల్

పాహిలి భోగ్, దేవాభిషేక పూర్ణిమ, మకర సంక్రాంతికి సంబంధించిన కార్యక్రమాలను ఈ సమావేశంలో ఖరారు చేశారు. నిర్ధారిత వేళల ప్రకారం శ్రీమందిరంలో నిత్య సేవలు, పూజలు, ఉత్సవాదులను సకాలంలో పూర్తిచేసి పాలకవర్గానికి సహకరించాలని సేవకులను కోరారు. ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల జనవరి 14వ తేదీ వరకు ఈ ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ వ్యవధిలో నిత్యం వేకువ జామున 2 గంటలకు శ్రీమందిరం సింహ ద్వారం తలుపులు తెరుస్తారు. తదనంతర సేవాదులు క్రమపద్ధతిలో సకాలంలో పూర్తి చేయాలని నిర్ణయించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10 గంటలకు స్వామివారి ఏకాంత సేవ పూర్తికాని పరిస్థితుల్లో తదనుగుణంగా సర్దుబాటు చేస్తారు. ఆంగ్ల సంవత్సరాది చిట్ట చివరి రోజు కావడంతో ఆలయంలో రద్దీ అధికంగా ఉంటుంది. మర్నాడు కొత్త సంవత్సరం తొలి దినం కావడంతో ఈ రద్దీ దాదాపు నిలకడా కొనసాగే అవకాశం ఉన్నందున ఏకాంత సేవ సర్దుబాటు అవసరం ఉంటుందని వివరించారు. వచ్చే ఏడాది జనవరి 15వ తేదీ మకర సంక్రాంతి. ఈ తిథి పురస్కరించుకుని శ్రీ మందిరం భక్తులు, యాత్రికులతో కిటకిటలాడుతుంది.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

మొక్కు తీరకముందే..!

భువనేశ్వర్: శ్రీజగన్నాథుని మొక్కు తీరకముందే ఇద్దరు భక్తులు దుర్మరణం పాలైన ఘటన భద్రక్ జిల్లా రాణితాల్ కూడలి వద్ద మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పశ్చిమ బెంగాల్ నుంచి జగన్నాథుని దర్శనం కోసం వస్తున్న కారు ప్రమాదానికి లోనయ్యింది. కారు తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో రాణితాల్ కూడలి సమీపంలో స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారందరినీ భద్రక్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరోవ్యక్తి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

ఎంపీ ధీరజ్ సాహు దిష్టిబొమ్మ దగ్ధం



ఎంపీ ధీరజ్ సాహు దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న దృశ్యం

బరంపురం: జార్ఖండ్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ధీరజ్ సాహు ఇళ్లు, కార్యాలయాల్లో రూ.353 కోట్ల నల్లధనం లభ్యమైన విషయం తెలిసిందే. దీంతో సోమవారం సాయంత్రం గంజాం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక కొమ్మపల్లి జంక్షన్‌లో ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు కన్నుచరణ్ పతి మాట్లాడుతూ ధీరజ్ సాహుతో రాష్ట్రంలోని పలువురు బీజేడీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఒడిశాలో రాష్ట్ర ప్రభుత్వం గత 23 ఏళ్లుగా మద్యం టెండర్లు పిలవకుండా అవినీతికి పాల్పడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మద్యం వ్యాపారుల ఆస్తులపై ఇదేవిధంగా దాడులు చేసినట్టైతే కోట్లలో నల్లధనం వెలుగులోకి వస్తుందని చెప్పారు. అనంతరం సీఎం ముఖ్యమంత్రి పేరుతో ఆర్‌డీసీకి ఫిర్యాదు చేశారు. ఆందోళనలో బీజేపీ నాయకులు ప్రభాత్ సడంగి, సునీల్ సాహు, రాజేంద్ర కుమార్ సాహు, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

గజపతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో ఈనెల 19వ తేదీ నుంచి 23 వరకు గజపతి ఉత్సవాలు–23 జరగనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పల్లెశ్రీ ఉత్సవాల పోస్టర్, టీజర్‌ను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ మంగళవారం ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ సాంస్కృతిక ఉత్సవాల్లోని స్టాల్స్‌లో పలు జిల్లాల నుంచి మిషన్ శక్తి, స్వయం సహాయక గ్రూపులు తయారు చేసిన వివిధ పచ్చళ్లు, కోయిపూర్ బెత్తం ఫర్నీచర్, ఇతర వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, డిప్యూటీ కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, సబ్–కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

మనదేశ సంస్కృతి గొప్పది

- బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా

బరంపురం: ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మన దేశ సంస్కృతి అత్యంత గొప్పదని బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా అన్నారు. స్థానిక రామచంద్రపూర్ ప్రభూ ఉపహార్ రిక్రూట్ సెంట్రల్ హాల్‌లో ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరియా విశ్వ విద్యాలయ శాంతికుండా ఆధ్వర్యంలో జాతీయ కళలు, సంస్కృతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్లోబలైజేషన్‌తో ప్రపంచం అత్యంత వేగంగా మారుతోందన్నారు. ప్రస్తుతం ప్రపంచ శాంతి అవసరమని పేర్కొన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రచారకర్త రాజయోగిని బ్రహ్మకుమారి మాల మాట్లాడుతూ ప్రపంచ శాంతితో పాటు మనిషికి ఆరోగ్యం కూడా అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ యోగ, ధ్యానం చేసి భగవంతుని స్మరణ చేసుకోవాలని సూచించారు. రాజయోగిని బ్రహ్మకుమారి మంజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజయోగి సుశాంతి కుమార్ బెహర, దహని కాశ పత్రిక సంపదకుడు ప్రమోద్ కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

23 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీసులు ఆటో స్టాండ్‌లో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అనుమానాస్పదంగా కనిపించిన ఒక వ్యక్తి బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అతని వద్దనుంచి 23.390 కిలోల గంజాయి, రూ.1,510 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

మావోయిస్టుల పేరుతో బెదిరింపులు

- రూ.60 లక్షలు ఇవ్వకుంటే హత్య చేస్తామని లేఖ
- పోలీసులకు పట్టుబడిన నలుగురు వ్యక్తులు



పోలీసులకు చిక్కిన నకిలీ మావోయిస్టులు

రాయగడ: మావోయిస్టుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను దొరాగుడ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కాసీపూర్ సమితి దొరాగుడ పోలీసుస్టేషన్ పరిధి ద్విముండి గ్రామంలో నివసిస్తున్న పరమానంద నాయక్ అనే వ్యక్తికి ఈనెల 3వ తేదీన మావోయిస్టుల పేరిట ఒక లేఖ వచ్చింది. టికిరిలో ఉన్న ఉత్కళ అలూమిన కర్మాగారంలో ఆయన పనిచేస్తున్నారు. అలాగే కొన్ని వాహనాలను కంపెనీకి అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నాడు. ఉద్యోగ రీత్యా 3వ తేదీన నాయక్ ఇంటిలో లేకపోవడంతో ఆ లేఖను చదవలేకపోయాడు. అనంతరం 5వ తేదీన నాయక్‌కు మావోయిస్టుల పేరుతో ఒక ఫోన్ వచ్చింది. తమకు రెండు రోజుల్లో రూ.60 లక్షలు చెల్లించాలని, లేదంటే ప్రజాకోర్టులో శిక్షిస్తామని హెచ్చరించి కాల్ కట్ చేశారు. అనంతరం ఇద్దరు వ్యక్తులు నాయక్ ఇంటికి వచ్చి, మావోయిస్టులుగా పరిచయం చేసుకుని మరో లేఖను ఇచ్చి వెళ్లిపోయారు. దీంతో భయాందోళనకు గురైన నాయక్ 6వ తేదీన దొరాగుడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన పోలీసులు కలంపూర్ పోలీసుల సహకారంతో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఈనెల 11వ తేదీ రాత్రి కలహండి జిల్లాలోని కలంపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో గల మండల్ గ్రామానికి చెందిన సూర్య ఒరఫ్ జస్వంత్ నాయక్ (35), అతని భార్య వర్షానాయక్ (32)లతో పాటు, రాయగడ జిల్లా కాసీపూర్ సమితి మిలిగా గ్రామానికి చెందిన పింటు ఓరాఫ్ రమేష్ నాయక్ (29), బ్రజరాజ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బుందియా కాలనీకి చెందిన కల్యాణి పంచఖయిలా (25)లను అరెస్టు చేశారు. వీరిని విచారించగా మావోయిస్టుల పేరుతో తామే భయపెట్టామని అంగీకరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



డాక్టర్ ఉమాకాంత్ బెహరాను సన్మానిస్తున్న డాక్టర్ పండ తదితరులు

రాయగడ: విద్యార్థులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని జిల్లాలోని గుణుపూర్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విశ్వ విద్యాలయం(జీఐఈటీ) అధ్యక్షుడు డాక్టర్ సత్యప్రకాష్ పండ సూచించారు. విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయ స్థిరత్వం కోసం సహజ వ్యవసాయం అన్న అంశంపై వర్క్‌షాపు మంగళవారం జరిగింది. న్యూఢిల్లీలోని కేసీ ఫౌండేషన్, అగ్రికల్చర్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ మేఘాలయ ఇంటర్నేషనల్ ఆర్గానిక్ అగ్రికల్చర్ అసోసియేషన్, జీఐఈటీ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ వర్క్ షాపులో ముఖ్య అతిథి డాక్టర్ పండ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు సహజ వ్యవసాయంపై ఉన్నత శిక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయ విధానం గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. న్యూఢిల్లీకి చెందిన భారత వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఉమాకాంత్ బిహర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహజ వ్యవసాయ విధానాలకు సంబంధించిన పలు సలహాలు, సూచనలను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్‌వీజీ రావు, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఏవీ శ్రీనివాస్, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైలెస్సో.. హైలెస్సా..!



జలాశయంలో పోటీలకు పడవలతో సిద్ధంగా ఉన్న గిరిజనులు

జిల్లాలో మాల్యవంత్ ఉత్సవాల్లో భాగంగా సత్తిగూడ జలాశయంలో పడవ పందేలు మంగళవారం నిర్వహించారు. మొత్తం 10 పడవల్లో ఒక్కో పడవలో నలుగురు చొప్పున 40 మంది గిరిజనులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను మల్కన్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. గిరిజనులకు క్రీడలపై అవగాహన పెంపొందించడం కోసమే వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. విజేతలకు ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అక్షయ్‌కుమార్ ఖేముందు, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, జిల్లా అదనపు ఎస్పీ తపాన్ నారాయణ్ రౌత్, మల్కన్‌గిరి తహసీల్దార్ చందన్ కుమార్ బోయి, డీఐపీఆర్వో ప్రమిళ మాఝి తదితరులు పాల్గొన్నారు. – మల్కన్‌గిరి



ఒడ్డుకు చేరుకుంటున్న పోటీదారులు



విజేతలతో అధికారులు




వేదికపై అతిథులు

ఆటలకు అధిక ప్రాధాన్యం



క్రీడా విజ్ఞాన కేంద్రం ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



విజ్ఞాన కేంద్రంతో అత్యాధునిక యంత్రాలు, పరికరాలు

- కళింగ స్టేడియంలో క్రీడా విజ్ఞాన కేంద్రం ఏర్పాటు
- ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: స్థానిక కళింగ స్టేడియంలో దేశంలోనే అతిపెద్ద అత్యాధునిక క్రీడా విజ్ఞాన కేంద్రం మంగళవారం ప్రారంభమైంది. క్రీడా ప్రతిభను పెంపొందించడంలో రాష్ట్రం నిబద్ధతలో ఈ కేంద్రం ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. అత్యున్నత స్థాయి పరికరాలు, నైపుణ్యాన్ని ఏకీకృతం చేయడం ద్వారా రాష్ట్ర అథ్లెట్ల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కేంద్రం ఒలింపిక్ క్రీడల బంగారు పతక విజేత అభినవ్ బింద్రా భాగస్వామ్యంతో స్థాపించబడింది.

పారా అథ్లెట్లకు ప్రత్యేకం

పారా-అథ్లెట్ల కోసం అనుకూలమైన పరికరాలు ఇతరేతర హంగులతో ఈ కేంద్రం ప్రత్యేకంగా రూపుదిద్దుకుంది. ఈ సదుపాయం యాంటీ గ్రావిటీ వెయిట్-బేరింగ్, సెన్సరీ డిప్రివేషన్, క్రయోజెనిక్ థెరపీ వంటి విప్లవాత్మక సాంకేతికతలను కూడా ఏకీకతం చేస్తుంది. క్రీడల్లో గాయపడడం ఇతరేతర అవాంఛనీయ పరిస్థితుల నుంచి వేగంగా కోలుకుని త్వరగా పునః ప్రవేశం చేసేందుకు ఈ సదుపాయాలు దోహదపడతాయి. వివిధ విభాగాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి ముందుకు నడిపించేందుకు పలు అధునాతన సౌకర్యాలతో పాటు గాయపడిన వారికి చికిత్స నిర్వహణ, పునరావాసం, సత్వర పునరుద్ధరణ, క్రీడల్లో పుంజుకునే చేయడంలో కేంద్రం చురుకైన పాత్ర పోషిస్తుంది. బయో మెకానిస్ట్‌లు, స్పోర్ట్స్ సైంటిస్టులు, ఫిజియోథెరపిస్ట్‌లు, ఎక్సర్ సైజ్ ఫిజియాలజిస్ట్‌లు, స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ స్పెషలిస్ట్‌లు, సైకాలజిస్ట్‌లు, న్యూట్రిషనిస్ట్‌లు, స్పోర్ట్స్ మసాజర్లు, నర్సులతో సహా సమగ్ర నిపుణుల బృందం అథ్లెట్ల కోసం నిరంతరం పనిచేస్తుంది. పారా అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా రూపకల్పన చేసిన పరికరాలతో ఇక్కడ శ్రద్ధ వహిస్తారు. కార్యక్రమంలో 5టీ, నవీన్ ఒడిశా చైర్మన్ వి.కార్తికేయ పాండియన్, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి తుషార్ కాంతి బెహరా, అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, క్రీడా విభాగం కార్యదర్శి వినీల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధునాతన క్రీడా విజ్ఞాన కేంద్రం సముదాయం

బీజేడీలోకి చేరికలు



పార్టీలో చేరినవారితో రబినారాయణ నందో

జయపురం: బొరిగుమ్మ సమితిలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. సమితిలోని హర్దిలి గ్రామ పంచాయతీకి చెందిన దాదాపు 60 మంది కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి రబినారాయణ నందో సమక్షంలో బీజేడీలో మంగళవారం చేరారు. వీరందరినీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై బీజేడీలో చేరుతున్నట్లు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేస్తామని వెల్లడించారు.

నేటి నుంచి ‘మండీ చలో’

భువనేశ్వర్: కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం కిసాన్ కాంగ్రెస్ బుధవారం నుంచి రాష్ట్రంలో మండీ చలో కార్యక్రమం నిర్వహించనుంది. ఈ ప్రచార కార్యక్రమం నెల రోజుల పాటు సుదీర్ఘంగా కొనసాగుతుందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తమ 17 ప్రధాన డిమాండ్ల నినాదంతో ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 13వ తేదీ వరకు ఒక నెల రోజుల పాటు ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వరి సేకరణ, కనీస గిట్టుబాటు ధర క్వింటాల్‌కు రూ.2,930 వేలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాల వర్షం కారణంగా రంగుమారిన వరి ధాన్యం కొనుగోలు, ప్రతి కొనుగోలు కేంద్రంలో సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు, వరి ధాన్యం కొనుగోలు మినహా ఇతర కారణాలతో మండీల్లోకి రైస్ మిల్లర్ల ప్రవేశం నివారణ, వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీని ఒకటిన్నర రెట్లు పెంచడం వంటివి వారి ఇతర డిమాండ్లుగా పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25,000 చొప్పున పరిహారం, వ్యవసాయ రుణమాఫీ, రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న ఓపీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్

వైభవంగా మండయ్



ఒడిస్సీ నృత్య కళాకారులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా గిరిజన క్రీడా సాంస్కృతిక సంబరం (లోకోత్సవ్) మండయ్-23 వైభవంగా జరుగుతోంది. జిల్లా కేంద్రానికి సమీపంలోని బెహరా గుడలో సుమారు 300 ఎకరాల మైదానంలో భారీ ఎత్తున ఈ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఈనెల 15వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగ రాష్ట్రానికి చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే అతిపెద్ద ఎగ్జిబిషన్, వాణిజ్య ప్రదర్శన శాల ఏర్పాటు చేశారు. దేశంలోని సుమారు 15 రాష్ట్రాలకు చెందిన చేతి వృత్తుల కళాకారులు వాణిజ్య సముదాయంలో విక్రయాలు చేస్తున్నారు. గిరిజన సాంప్రదాయ పద్ధతిలో జరిగే ఉత్సవాలు తిలకించడానికి వేలాది మంది ప్రజలు తరలి వస్తున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర, ఎస్పీ రోహిత్ వర్మ, ఎంపీ రమేష్ చంద్ర మజ్జి తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన



ఒడిస్సీ నృత్య ప్రదర్శన



అతిథులకు మండయ్ స్మారకం అందజేస్తున్న కలెక్టర్ కమలోచన్ మిశ్ర



ఉత్సవాలకు హాజరైన ప్రజలు

పేదల కళ్లలో ‘వెలుగులు’



విద్యుత్ బకాయిలు చెల్లించిన రశీదుతో గ్రామస్తులు

- విద్యుత్ బకాయిలు చెల్లించిన మైత్రీ సంస్థ

రాయగడ: దీర్ఘకాలంగా విద్యుత్ బకాయిలు చెల్లించలేక అంధకారంలో మగ్గుతున్న ఒక గ్రామానికి మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విద్యుత్ బకాయిలను చెల్లించి గ్రామంలో వెలుగులు పునరుద్ధరించింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కాసీపూర్ సమితి సుంగేరు గ్రామ పంచాయతీ పరిధి బిరబాపుల్ గ్రామంలో సుమారు 40 కుటుంబాలు నివసిస్తున్నాయి. నిరుపేదలైన వీరంతా విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉండడంతో అధికారులు గ్రామంలోని విద్యుత్ సమస్యలను గాలికొదిలేశారు. 6 నెలల క్రితమే గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవ్వడంతో అప్పటి నుంచి అంధకారం నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు రాత్రుళ్లు చదువుకోవడానికి అవస్థలు పడ్డారు. దీంతో గ్రామంలోని కొంతమంది యువకులు టికిరిలోని మైత్రీ సంస్థ అధినేత టి.శ్రీనివాస్‌రావును కలిసి సమస్యను వివరించారు. తమను ఆదుకోవాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన గ్రామంలోని విద్యుత్ బకాయిలను చెల్లించేందుకు మంగళవారం గ్రామస్తులతో పాటు తన సంస్థ సిబ్బందిని పంపించి విద్యుత్ కార్యాలయంలో బకాయిలు చెల్లించారు. ఫలితంగా గ్రామస్తులు విద్యుత్ వెలుగులను మరలా చూశారు. తమ గ్రామంలో విద్యుత్ పునరుద్ధరించేందుకు సహకరించిన మైత్రీ సంస్థకు గ్రామస్తులు ధన్యవాదాలను తెలియజేశారు. తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

క్రీడల్లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలవాలి



జయపురం: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు



జయపురం: బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి





పర్లాకిమిడి: జావెలిన్ త్రోలో పోటీపడుతున్న విద్యార్థులు

జయపురం: క్రీడల్లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలవాలనే ధ్యేయంతో ప్రభుత్వం యువ ఒడిశా - నవీన ఒడిశా నినాదంతో వివిధ పోటీలు నిర్వహిస్తోందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక విక్రమ్ క్రీడా మైదానంలో మున్సిపాలిటీ స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలియజేశారు. క్రీడలపై యువత ఆసక్తి కనబర్చి కొరాపుట్ జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర మహంతి బౌలింగ్ చేయగా బాహిణీపతి బ్యాటింగ్ చేసి అలరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారి బిశ్వనాథ్ పాత్రో, జయపురం సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్ పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయంప్రతిపత్తి కళాశాలలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపు మేరకు యువ ఒడిశా - నవీన్ ఒడిశా క్రీడా పోటీలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్ పట్నాయక్ మంగళవారం ప్రారంభించారు. కబడ్డీ, రన్నింగ్, జావెలిన్ త్రో, ఖో-ఖో, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఈటీ నిరంజన్ బెహరా, క్రీడా నోడల్ అధికారి పుల్లక్ చంద్ర ఫిలిప్, సయ్యద్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డెంకాడ: మండలంలోని మోదవలస వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు డెంకాడ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ పరిధి ఫాటోగ్యాలరీ ప్రాంతంలో విజయనగరం–విశాఖ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండడాన్ని గమనించి, స్థానికుల సమాచారంతో వచ్చిన 108 అంబులెన్స్ సిబ్బంది వాహనంలో విజయనగరం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ 11వ తేదీ రాత్రి మరణించాడు. ఈ మేరకు వీఆర్‌వో గణేష్ ఫిర్యాదు చేయడంతో డెంకాడ ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరణించిన వ్యక్తి వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎవరైనా సంబంధీకులు ఉండి వివరాలు తెలిస్తే డెంకాడ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై మహేష్ కోరారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన ఎస్.అప్పారావు(59) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు మంగళవారం తెలిపారు. అప్పారావు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి పురుగు మందు తాగేశాడు. స్థానికులు గమనించి వెంటనే గజపతినగరం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని మొదటి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు సిబ్బందిని పంపించి వివరాలు సేకరించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి రెండో భార్య అన్నపూర్ణ ఆరుగురు పిల్లలు ఉన్నారు.

పోరాంలో అగ్నిప్రమాదం


ప్రమాద పరిస్థితిని తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామానికి చెందిన మామిడి వెంకన్న ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంపై స్థానిక వీఆర్వో అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.30వేల నగదుతో పాటు 40వేల ఖరీదు చేసే ఇంటి సామగ్రి కాలిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రామకృష్ణతో పాటు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు రత్నాకర్ ఉన్నారు.

520 కేజీల పీడీఎస్ బియ్యం సీజ్


సీజ్ చేసిన బియ్యం వద్ద సీఎస్‌డీటీ తదితరులు

కొత్తవలస: మండలంలోని మిందిరామచంద్రపురం గ్రామంలో హనుమానొట్టి బాబాజీ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 520 కేజీల పీడీఎస్ బియ్యాన్ని సీఎస్‌డీటీ కె.ఇందిర మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. ఓ అజ్ఞాన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు సీఎస్‌డీటీ ఇందిర, వీఆర్‌ఓ గౌరిలు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన 520 కేజీల బియ్యాన్ని సీజ్ చేసి చెంతనే గల డీలర్ వద్ద భద్రపర్చినట్లు సీఎస్‌డీటీ ఇందిర తెలిపారు. కాగా ఇదే వ్యక్తి వద్ద రెండు నెలల క్రితం 1532 కేజీల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సదరు వ్యక్తిపై మరో మారు 6ఎ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ ఇందిర తెలిపారు.

పెంకుటిళ్లు దగ్ధం

పార్వతీపురం: మండలంలోని నర్సిపురం పెద్ద వీధిలో మాచర్ల శ్రీరాములు, లచ్చిపతుల ఉమామహేశ్వరరావులకు చెందిన పెంకుటిళ్లు మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. మాచర్ల శ్రీరాములు ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న విలువైన ఆస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేయడంతో సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన నష్టంపై అధికారులు అంచనా వేయాల్సి ఉంది.

దీపోత్సవం




జామి మండలం అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం సీతరామచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అన్నంరాజుపేట పరిసర గ్రామాల భక్తులు పాల్గొని దీపారాధన చేశారు. పద్మనాభం వేణుగోపాలస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం రోజున ఇక్కడ కూడా ఏటా దీపోత్సవం నిర్వహిస్తామని అర్చకుడు తెలిపారు. – జామి

వ్యవ'సాయం'లో ఆమె


రామభద్రపురంలో వ్యవసాయ పనులకు వెళ్తున్న మహిళా రైతులు


రామభద్రపురంలో భర్తతో కలిసి మార్కెట్‌కు కూరగాయలు తీసుకెళ్తున్న భార్య

వ్యవసాయం అంటే ఓ వ్యాపకం. ఇంటిల్లపాదీ కష్టపడితేనే కర్షకులకు కాసిన్ని డబ్బులు మిగులుతాయి. కుటుంబ జీవనం సాఫీగా సాగుతుంది. వ్యవసాయ పనుల్లో మగవారితో సమానంగా మహిళలు పాల్గొంటున్నారు. విత్తనాలు విత్తిన నుంచి పంట కోసి మార్కెట్‌కు తరలించేవరకు అండగా ఉంటున్నారు. కుటుంబ నావను నడిపించడంలో తమదైన శైలిలో ముందుకు 'సాగు'తున్నారు. రామభద్రపురం పరిసర ప్రాంతాల్లో 'సాక్షి'కి చిక్కిన ఈ చిత్రాలే దీనికి నిలువెత్తు నిదర్శనం. – రామభద్రపురం

అంగన్‌వాడీల్లో ఆంగ్లబోధన

- కేంద్రాలకు రావడానికి ఇష్ట పడుతున్న పిల్లలు
- పిల్లలు ఇష్టపడేలా భోజనం
- గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టి కాహారం


సాలిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు తింటున్న పిల్లలు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు స్వచ్ఛందంగా వచ్చే విధంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పిల్లలకు అందించే విద్య దగ్గర నుంచి పౌష్టికాహారం వరకు అన్నింటా మార్పులు తీసుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం కంటే మెరుగైన సౌకర్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్పించింది. పిల్లలకు పెట్టే భోజనంలో పూర్తిస్థాయిలో మార్పులు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు కాన్వెంట్లకు దీటుగా విద్యను బోధిస్తోంది.

పీపీ కిట్లు పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచేవారుకాదు. ఆంగ్ల మాధ్యమంలో పిల్లలు పట్టు సాధించే విధంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో కాన్వెంట్ల తరహాలోనే ఆంగ్లం బోధిస్తున్నారు. పిల్లల బోధనకు సంబంధించి 3 నుంచి 4 సంవత్సరాల లోపు పిలలకు ఇంగ్లీష్ , మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌లకు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1 కిట్, 4 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ కిట్–2ను ప్రభుత్వం అందజేసింది. వాటితో పిల్లలకు బోధిస్తున్నారు. కిట్‌లో బొమ్మలు దిద్దడానికి అవసరమైన కలర్ పెన్సిల్స్, జంతువులు గుర్తించే బొమ్మలు అందించారు. పిల్లలకు బొమ్మలు, ఆటపాటలతో చదువు చెప్పడంతో అంగన్ వాడీ కేంద్రాలకు రావడానికి పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యంగా, బలంగా ఉండేందుకు మంచి పౌష్టికాహారాన్ని కూడా ప్రభుత్వం అందిస్తోంది.

ప్రతి రోజు గుడ్లు

గత ప్రభుత్వ హయంలో వారానికి రెండు సార్లు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు గుడ్లు ఇచ్చేవారు. కానీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సెలవురోజు మినహా ప్రతి రోజూ పిల్లలకు గుడ్డు, పాలు అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారంతా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పిల్లలే. వారిలో చాలామంది పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారం అందించే పరిస్థితి ఉండదు. దీన్ని గమనించిన ప్రభుత్వం పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తోంది.


గంట్యాడ మండలంలోని అంగన్ వాడీ కేంద్రంలో బొమ్మలకు రంగులు దిద్దుతున్న చిన్నారులు

రోజుకో రకమైన ఆహారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం రోజుకో రకమైన భోజనాన్ని అందిస్తోంది. దీంతో పిల్లలు తినేందుకు అమితంగా ఇష్టపడుతున్నారు. సోమవారం అన్నం దోసకాయ పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు పెడతారు. మంగళవారం పులిహోర, టమాటో పప్పు ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు ఇస్తారు. బుధవారం అన్నం ఆకుకూర పప్పు , ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు ఇస్తారు. గురువారం అన్నం, ఆకుకూర, ఉడికించిన కోడిగుడ్డు, 100 మి.లీ పాలు ఇస్తారు. శుక్రవారం అన్నం సొరకాయ పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు, శనివారం వెజిటుబుల్ రైస్, ఆకుకూర, ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు అందిస్తారు.

జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో 2499 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 8,588 మంది గర్భిణులు ఉన్నారు. అదేవిధంగా బాలింతలు 9692 మంది, 6 నెలల నుంచి ఏడాది వయస్సు లోపు పిల్లలు 10, 351 మంది ఉన్నారు. 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలు 34, 270 మంది ఉన్నారు. 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 25,150 మంది ఉన్నారు.

గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్



గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. వారి ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ (పౌష్టికాహారం కిట్)ను ప్రభుత్వం అందిస్తోంది. గర్భిణులకు నెలకు సరిపడా గుడ్లు, పాలు, బెల్లం, ఖర్జూరం, వేరుశనగ చెక్కీలు, రాగి పిండితో కూడిన కిట్లు అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు వచ్చే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. కాన్వెంట్ తరహాలో ఆంగ్ల బోధన, రుచికరమైన భోజనం కేంద్రాల్లో పెడుతున్నాం. గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహారం, రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తోంది.

– బి.శాంత కుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

ఇష్టంగా తింటున్న పిల్లలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు భోజనం, గుడ్డు, పాలు వంటి పోషకాలతో రుచికరమైన భోజనాన్ని అందించడంతో ఇష్టంగా తింటున్నారు. కేంద్రాలకు నిర్దేశించిన మెనూ ప్రతిరోజూ అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో ప్రతి రోజూ పిల్లలకు పెట్టే భోజనం వివరాలు ఫొటో తీసి అంగన్‌వాడీలు అప్‌లోడ్ చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

కరాటే పోటీల్లో పతకాలు


కరాటే పోటీల్లో సాధించిన పతకాలతో క్రీడాకారులు

విజయనగరం: విశాఖలో జరిగిన కరాటే పోటీలలో విజయనగరం క్రీడాకారులకు పలు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కానూరు సంతోష్ మంగళవారం విడుదల ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10, 11వ తేదీలలో విశాఖలోని స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ మేయర్ కప్–2023లో కరాటే, కుమిటి విభాగాల్లో జిల్లా క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలు లభించాయని పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనగా అందరికీ పతకాలు లభించాయన్నారు. ఎస్.శ్రీకాంత్, పి.హేమంత్‌లు కరాటే, కుమిటీలో బంగారు పతకాలు సాధించగా యోచనకు కరాటేలో బంగారు, కుమిటీలో వెండి పతకం లభించిందని చెప్పారు. ఎం.హర్షవర్ధన్, కె శివగణేష్‌లు కరాటేలో బంగారు, కుమిటీలో కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. బి.యశ్వంత్, జి.తిరుమల కరాటే, కుమిటీ విభాగాల్లో వెండి పతకాలు గెలుచుకోగా ఆంధ్రప్రదేశ్ కెన్యూర్యూ అధ్యక్షుడు కె.సుమన్ విజేతలకు పతకాలు అందజేశారని తెలిపారు. పట్టణానికి చెందిన విద్యార్థులు తమ కళాశాల క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొంది ఈ పతకాలు సాధించడం పట్ల సాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ సాయిదేవమణి అభినందనలు తెలిపారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా


ఇంటర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పలు పతకాలు సాధించి విజయనగరం జిల్లా కీర్తిప్రతిష్టలను చాటి చెప్పారు. నాలుగు రోజుల పాటు జరిగిన పోటీల్లో 45 కేజీల బరువులో తలపడిన బి.రాజేశ్వరి బంగారు పతకం కై వసం చేసుకోగా..49 కేజీల విభాగంలో బి.చంద్రిక కాంస్య పతకం దక్కించుకుంది. అదేవిధంగా 64 కేజీల విభాగంలో ఎస్.పల్లవి బంగారు పతకం..71 కేజీల విభాగంలో బి.నాని వెండి పతకం సాధించారు. 81 కేజీల విభాగంలో సీహెచ్ లక్ష్మి బంగారు పతకం, 87 కేజీల విభాగంలో వై.చైతన్యకుమారి కాంస్యం, 87 ప్లస్ విభాగంలో ఆర్ గాయత్రి బంగారు పతకం, 81 కేటగిరీలో కేవీ శ్రీరామ్ కాంస్య పతకం దక్కించుకున్నారు. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధి బి.లక్ష్మి, కార్యదర్శి చల్లా రాము, కోచ్ శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు


బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

- హోరా..హోరీగా సాగుతున్న స్కూల్‌గేమ్స్

విజయనగరం: విజయనగరం వేదికగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు హోరా..హోరీగా సాగుతున్నాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ బాక్సింగ్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన పోటీలు రెండవ రోజు మంగళవారం కొనసాగాయి. అండర్ –14,17,19 వయస్సు విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 960 మంది క్రీడాకారులు హాజరు కాగా..రెండవ రోజు ముగిసే సమయానికి మూడు వయస్సుల విభాగాల్లో పోటీలు సెమీస్ దశకు చేరుకున్నాయి. బుధవారం ఫైనల్స్ నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

గుంతలో పడి రెండు పశువుల మృతి


గుంతలో పడి మృతి చెందిన పశువులు వద్ద రోదిస్తున్న బాలకృష్ణ కుటుంబసభ్యులు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మర్రివలస గ్రామం సమీపంలో ఉన్న చంపావతి నది గుంతలో పడి రెండు పశువులు మృతి చెందగా పశువుల కాపరి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మర్రివలస గ్రామానికి చెందిన బాలకృష్ణ తన పశువులకు లంకె వేసి మేపిస్తుండగా చంపావతి నది సమీపానికి వచ్చేసరికి రెండు పశువులు నదిలోకి ప్రవేశించి ఒక్కసారిగా గుంతలో కూరుకుపోయాయి.అక్కడే ఉన్న బాలకృష్ణ పశువులను రక్షించేందుకు వెళ్లి ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకున్నాడు. ఇటీవల నది పరివాహక ప్రాంతంలో నాటుబళ్ల యజమానులు ఇసుకను తీసుకెళ్లేందుకు గుంతలను తవ్వి అలానే ఉంచేయడం, తుఫాన్ ప్రభావంతో చంపావతి నదిలో పూర్తిస్థాయిలో నీరు పారడంతో గుంతలను కనిపెట్టలేకపోయామని, పశువుల కాపరి చెప్పాడు. గ్రామాలను ఆనుకుని ఉన్న చంపావతి చుట్టూ ఇలాంటి గుంతలే అధికంగా ఉన్నాయని, ఇప్పటికైనా నదిని దాటేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారం, నగదు చోరీ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ మురళీధర్

పార్వతీపురంటౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో గల వైకేఎం కాలనీలోని ఓ ఇంట్లో బంగారంతోపాటు నగదు చోరీకి గురయ్యాయి. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై డీఎస్పీ మురళీధర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. వైకేఎం కాలనీలో ఉంటున్న సంభాన ప్రసాద్, రాణిల ఇంట్లో అర్ధరాత్రి సుమారు 1గంట నుంచి 2 గంటల మధ్యలో ఇద్దరు వ్యక్తులు ముసుగువేసుకుని ప్రవేశించారు. బెడ్‌రూంలోకి వెళ్లిన దొంగలు నిద్రలో ఉన్న ఇంటి యజమానురాలు రాణిని లేపి కత్తితో బెదిరించి బీరువాలో ఉన్న పది తులాల బంగారం, 65వేల నగదుతోపాటు మూడు తులాల పట్టీలను పట్టుకుపోయారు. దొంగలు ఇంటి నుంచి బయటకు వెళ్తున్న సమయంలో రాణి కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే గస్తీ తిరుగుతున్న పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్సై సంతోషికుమారి, క్రైం పరిశోధన పోలీసులు ఉదయ్, రాజశేఖర్‌లు సంఘటనా స్థలానికి వచ్చి బాధితుల వద్ద వివరాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.

జాతీయ స్థాయి పోటీలకు చైత్రిక ఎంపిక


జాతీయస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన చైత్రిక

పాలకొండ రూరల్: పట్టణానికి చెందిన బొడ్డేపల్లి చైత్రిక జాతీయస్థాయి అండర్–14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు ఆమె తల్లితండ్రులు శ్రీనివాసరావు, పూర్ణిమలు మంగళవారం విలేకరులకు తెలిపారు. తమ కుమార్తె మండలంలోని అన్నవరం డీఏవీ పాఠశాల ద్వారా విశాఖ రీజనల్, హైదరాబాద్ రీజనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల 10వ తేదీన హర్యానాలోజరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తలపడనున్నట్లు వివరించారు.

సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ కప్‌కు పారాది విద్యార్థులు

బొబ్బిలి: ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగే సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ కప్‌కు పారాది జెడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన సుప్రియ, ప్రశాంతిలు ఎంపికైనట్లు పీడీ నల్ల వెంకట నాయుడు, కోచ్ సత్యనారాయణలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, ప్రజలు వారిని అభినందించారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం


విజేత జాజిలిని అభినందిస్తున్న డైరెక్టర్ వింజమూరి విజయకుమార్

బొబ్బిలి: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో గత వారం జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలి పట్టణంలోని ఐరిస్ హైస్కూల్ విద్యార్థిని సదాశివుని జాజిలి కాంస్య పతకం సాధించింది. స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జాజిలి మంచి ప్రతిభ కనబర్చడంతో పాఠశాల డైరెక్టర్‌లు వింజమూరి విజయకుమార్, వి.వసంతకుమారి, ప్రిన్సిపాల్ శంకరరావు అభినందించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


ఎస్సై సమక్షంలో గోల్డ్‌చైన్ అందుకుంటున్న విద్యార్థిని

రాజాం సిటీ: మండలంలో బొద్దాం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బొర్రా వాసు తన నిజాయితీని చాటుకున్నాడు. రెండురోజుల క్రితం తనకు తన ఆటోలో తులంపావు బంగారు గొలుసు అతనికి దొరికింది. ఈ గొలుసు ఆటోలో ప్రయాణిస్తున్న వారిదిగా గుర్తించి రాజాం పోలీసులకు సమాచారం అందించాడు. ఇంతలో జీఎంఆర్‌ఐటీలో చదువుతున్న శ్రీకాకుళానికి చెందిన మాధవి అనే విద్యార్థిని రెండురోజుల క్రితం ఈ ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు బంగారు గొలుసుపోయినట్లు గుర్తించి తన కుటుంబసభ్యులతో వచ్చి మంగళవారం ఆటోడ్రైవర్‌ను కలిసి చెప్పింది. వెంటనే ఆటో డ్రైవర్ రాజాం ఎస్సై రవికిరణ్‌ను సంప్రదించి, విద్యార్థిని వివరాలు వెల్లడించాడు. దీంతో పోలీసులు పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆ చైన్ విద్యార్థినిదేనని గుర్తించి ఎస్సై సమక్షంలో ఆమెకు ఆటోడ్రైవర్‌తో గోల్డ్‌చైన్ ఇప్పించారు. ఆటో డ్రైవర్ వాసు నిజాయితీని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.